

లక్ష్మీ గణపతి గ్రామోత్సవం

తాడేపల్లిరూరల్: ఉండవల్లి సెంటర్ సూపర్ బజార్ వద్ద ఉన్న లక్ష్మీ గణపతి మందిరంలో ఆదివారం ఆషాఢ మాసం సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు.



వైభవంగా జగన్నాథుని రథయాత్ర

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని రాధ గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీజగన్నాథుని రథ యాత్ర వైభవంగా నిర్వహించారు.

ప్రసన్నవదనం అలంకారంలో బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రసన్నవదనంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నేతి వేంకటేశ్వరస్వామి ఆదాయం రూ.4.93 లక్షలు

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు గ్రామంలోని కొండపై వేంచేసి ఉన్న మత్స్యావతార శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆదాయం రూ.4.93లక్షలు వచ్చినట్లు సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మూడునెలల కాల పరిమితికి గాను హుండీ ఆదాయం లెక్కించగా రూ.4,93,807లు వచ్చినట్లు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, అర్చకుడు తెలగనేని వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి కర్నాటి గురవయ్య, రుసుం కోటేశ్వరరావు, నందా గోపాలరావు, మునగా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు నిజాంపట్నంలో అప్రెంటీస్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: బాపట్ల జిల్లా నిజాంపట్నంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం అప్రెంటీస్ మేళా జరగనున్నట్లు గుంటూరులోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఆనందబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, అహల్య నర్సింగ్ హోంలలో ఎంపీహెచ్‌డబ్ల్యూలో 36, ఎంఎల్‌టీలో 24, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో రెండు ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్వహిస్తున్న అప్రెంటీస్ మేళాలో గుంటూరు జిల్లాకు చెందిన విద్యార్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ పూర్తి చేసుకున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేళాలో ఎంపికై న విద్యార్థులకు నెలకు రూ.ఏడు వేలు స్టైఫండ్ ఇస్తారని, టెన్త్ మార్కుల జాబితా మూడు సెట్లు, ఆధార్ కార్డు, ఇంటర్ మార్కుల జాబితా, ఆరు పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు.

వీనులవిందుగా గోష్టిగానం




విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు, సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి శిష్యుల ఆధ్వర్యంలో శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత సద్గురువర్యుల ఆరాధానోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమాలు త్యాగరాజ స్వామి రచించిన ఘనరాగ పంచరత్న కీర్తలను సంగీత విద్వాంసులు మధురంగా ఆలపించారు. మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, మల్లాది కార్తీక త్రివేణి, భమిడిపాటి శ్రీలలిత, బీవీ దుర్గాభవాని, కె. మహాలక్ష్మి, ఎస్. నాగలక్ష్మి, పద్మా చక్రవరికత పెరవలి నంగకమార్ పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ గోష్టిగానంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ఆరాధనా సంగీతోత్సవంలో పలువురు విద్వాంసులు పాల్గొన్నారు.

'కూచిపూడి' ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని మొవ్వ మండలం కూచిపూడిలో గల శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో కూచిపూడి నాట్యం సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు జరిగిన సర్టిఫికెట్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షకు 28 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా రవి బాల కృష్ణ తెలిపారు. ఈ పరీక్షకు పరీక్షాధికారిగా డాక్టర్ విజయ్ పాల్ లోక్‌పాత్ వ్యవహరించగా.. గాత్రంపై టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ వేదాంతం వెంకట దుర్గా భవాని, మృదంగంపై పసుమర్తి హరినాథశాస్త్రిలు సహకరించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 503.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 814.10 అడుగుల వద్ద ఉంది.

చింతలు తీర్చిన రాజన్న

పులిచింతలతో వందేళ్ల కలను సాకారం చేసిన మహానేత వైఎస్సార్

చెంతనే కృష్ణమ్మ పారుతున్నా.. గొంతు తడవని పరిస్థితి.. కనుచూపు మేరలో నీరు కనిపిస్తున్నా పొలాలు ఎండిపోతున్న దుస్థితి.. మరోవైపు వానాకాలంలో వందల టీఎంసీల నీరు సముద్రంలో వృథాగా కలిసే స్థితి. వీటన్నింటిని మార్చేలా.. కృష్ణా డెల్టాలోని వేల ఎకరాలు సాగులోకి తెచ్చేందుకు.. భూగర్భ జలాలు పెంచేందుకు దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ నడుం బిగించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా పులిచింతలకు శ్రీకారం చుట్టి.. జనం చింతలు దూరం చేశారు. తమ వందేళ్ల కలను సాకారం చేసి.. తమ కలల సౌధాన్ని కళ్లముందు సాక్షాత్కరింపజేసిన మహానేతను ఈ ప్రాంత ప్రజలు నిత్యం స్మరించుకుంటారు.

- మహానేత మనసాస్మరామీ
- కృష్ణా డెల్టా వాసుల కలను సాకారం చేసిన జలయజ్ఞ ప్రదాత
- 2004లో ప్రాజెక్టుకు పునాదిరాయి
- 2008లో కృష్ణాతీరంలో పది ఎత్తిపోతల పథకాల నిర్మాణాలకు శిలాఫలకాల ఆవిష్కరణ
- 2008లో అచ్చంపేట, బెల్లంకొండ మండలాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, క్రోసూరులో పాలిటెక్నిక్ కళాశాల మంజూరు



2004, అక్టోబర్ 15న పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)



గతేడాది వరకు నిండు కుండను తలపించేలా పులిచింతల ప్రాజెక్టు రిజర్వాయర్



డాక్టర్ వైఎస్సార్ మంజూరు చేసిన అచ్చంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు అనే వందేళ్ల కల దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలోనే సాకారమైంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా.. వెరువక మహానేత వైఎస్సార్ ప్రాజెక్టును ప్రారంభించి, దాదాపుగా పూర్తిచేశారు. దివంగత ఎన్టీఆర్ రెండుసార్లు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రయత్నించి విఫలమయ్యారు. కృష్ణానదిపై పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం ద్వారా 45.77 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి కృష్ణా డెల్టా ప్రాంతంలో 23లక్షల హెక్టార్ల భూములకు సాగునీటిని అందిస్తూ, ఏడాదిలో రెండు పంటలు పండేలా భూములు సస్యశ్యామలం చేయవచ్చని, ప్రాజెక్టు చుట్టుపక్కల ఉండే ప్రాంతాలలో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో మహానేత డాక్టర్ వైఎస్సార్ 2004, అక్టోబరు 15న అచ్చంపేట మండలం, మాదిపాడు పంచాయతీ పరిధిలోని జడపల్లి మోటు తండాకు సమీపంలో భూమి పూజ చేశారు. 2009 నాటికి 80శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 20శాతం పనులు పూర్తి చేయడానికి ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలకు నాలుగేళ్లు పట్టింది. ప్రాజెక్టు పూర్తయినా 2014 నుంచి 2019వరకు బాబు పాలనలో ఏనాడు ప్రాజెక్టు నిండిన పాపాన పోలేదు.

జగనన్న పాలనలో జలకళ.. నేడు వెలవెల

మహానేత డాక్టర్ వైఎస్సార్ దూరమైనా ఆయన ఆశయాలు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నెరవేరాయి. 2019లో వైఎస్ జగన్ సీఎం అయిన తరువాత 2023 వరకు ప్రతియేటా నిండుకుండను తలపించేలా 45 టీఎంసీల నీటితో ప్రాజెక్టులో కృష్ణాజలాలు కళకళలాడాయి. డెల్టా ప్రాంత భూములకు సాగునీరు పుష్కలంగా వదిలారు. అదేమి మాయో కానీ 2024 చంద్రబాబు పాలన వచ్చింది.. మళ్లీ ప్రాజెక్టు అడుగంటిపోయింది. ఈ ఏడాది ప్రాజెక్టులో చుక్కనీరు లేదు.

పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధిపై 'రాజ'ముద్ర

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పెదకూరపాడు నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింది. 2004లో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు.

- 2008లో రైతులు ఏడాదిలో రెండు పంటలు పండించుకునేలా కృష్ణానది తీరంలో రూ.250 కోట్ల అంచనా వ్యయంతో ఒకేసారి 10 ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారు.
- అచ్చంపేట మండలంలోని 14 గ్రామాల దాహార్తిని తీర్చేందుకు 2008లో పుట్లగూడెం వద్ద రక్షిత మంచినీటి పథకానికి అంకురార్పణ చేశారు.
- విద్యాభివృద్ధికోసం 2006లో అచ్చంపేట, బెల్లంకొండ మండలాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరు..
- 2007లో నియోజకవర్గంలోని అన్ని మండలాలలో బాలికలకోసం ప్రత్యేకంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల ప్రారంభం
- అదే ఏడాది క్రోసూరులో పాలిటెక్నిక్ కళాశాలలను మంజూరు చేసి జిల్లా పరిషత్ హైస్కూలు అదనపు తరగతి గదుల్లో కోర్సులను ప్రారంభింపజేశారు. ఆ కళాశాలకు జగనన్న ప్రభుత్వంలో రూ.7కోట్ల వ్యయంతో పక్కా భవనం నిర్మించారు.
- అమరావతి మండలంలోని ఎండ్రాయి, నరుకుళ్లపాడు వద్ద వాగులపై హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తి చేయించారు. ఇవన్నీ పెదకూరపాడు నియోజకవర్గానికి రాజన్న మిగిల్చిన తీపి జ్ఞాపకాలు.

టన్ను ఇసుక ధర రూ.250

నేటి నుంచి అందుబాటులోకి



గుంటూరు వెస్ట్: ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించిన ధరల వివరాలను ఆదివారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి విడుదల చేశారు. సాధారణ ఖర్చులకుగాను ఇసుక టన్నుకు రూ.250 ధరను నిర్ణయించారు. జిల్లాలో కొల్లిపర మండలం, మున్నంగి, తాడేపల్లి మండలం గుండిమెడ, తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం, లింగాయపాలెం రీచ్‌ల నుంచి ఇసుకను కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. ఆయా ఇసుక రీచ్‌ల నుంచి తరలించేందుకు వాహన ఖర్చులను కూడా కొనుగోలుదారుడే భరించాలి. కొనుగోలుకు సంబంధించిన మొత్తాలను డిజిటల్ పేమెంట్స్ ద్వారా చెల్లించాలన్నారు. ఒక్కొక్క వ్యక్తి ఒక్క రోజుకు గరిష్టంగా 20 టన్నుల ఇసుకను మాత్రమే కొనుగోలు చేయాలని నిబంధన పెట్టారు. ఆధార్ కార్డుతో పాటు అన్ని వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఇసుక కొనుగోలు విషయంలో ఏమైనా ఫిర్యాదులుంటే టోల్ ఫ్రీ నెంబర్ 0863–2234301 నెంబర్‌కు తెలపాలన్నారు.

దుర్గమ్మకు నాట్యనీరాజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సాయంత్రం విశాఖపట్నంకు చెందిన వరసిద్ధి వినాయక కూచిపూడి కళాశాలకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదిక వద్ద చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇవ్వగా, భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు ప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ సీట్లకు ఆప్షన్ల నమోదు

- కొనసాగుతున్న ఏపీ ఈఏపీసెట్–2024 కౌన్సెలింగ్
- కళాశాలల ఎంపికకు ఈనెల 12 వరకు వెబ్ కౌన్సెలింగ్



ఏపీ ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్ ప్రవేశ ప్రక్రియలో కీలక దశ ఆసన్నమైంది. ఈనెల ఒకటో తేదీన మొదలైన ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్–2024) కౌన్సెలింగ్ కొనసాగుతోంది. దీనిలో భాగంగా ఎంపీసీ స్ట్రీమ్‌లో అర్హత సాధించిన విద్యార్థులు సోమవారం నుంచి ఇంజినీరింగ్ కళాశాలల ఎంపికకు వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఈనెల 12లోపు సెట్స్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా వెబ్ ఆధారిత ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.

నమోదు ఇలా..

సైట్‌లో పొందుపర్చనున్న రాష్ట్ర వ్యాప్త ఇంజినీరింగ్ కళాశాలల జాబితా నుంచి విద్యార్థులు తమ ర్యాంకు ఆధారంగా నచ్చిన కళాశాలను, బ్రాంచ్‌ను ఎంపిక చేసుకోవాలి. వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయిన విద్యార్థులు ఆల్ డిస్ట్రిక్ట్స్ అని ఆప్షన్ ఎంపిక చేసుకోవడం ద్వారా వారికి రాష్ట్రంలోని అన్నిజిల్లాల వారీగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల జాబితా ప్రత్యక్షమవుతుంది. కళాశాలల జాబితాతో పాటు ఆయా కళాశాలల్లోని బ్రాంచ్‌లు కనిపిస్తాయి. విద్యార్థులు తాము చేరదలచుకున్న కళాశాలలకు ప్రాధాన్య క్రమంలో ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలి. ఆప్షన్ల నమోదు కోసం విద్యార్థులు తమ ఇంట్లోని పర్సనల్ కంప్యూటర్‌తో పాటు ప్రైవేటు నెట్ కేంద్రాలు, హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లవచ్చు. ఏఎన్‌యూతోపాటు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఆప్షన్ల నమోదులో సహాయం అందిస్తారు.

ఈనెల 16న సీట్ల కేటాయింపు

ఈనెల 12 వరకు ఆప్షన్లు నమోదు చేసుకున్న విద్యార్థులు వాటిని మార్చుకునేందుకు ఈనెల 13న చివరి అవకాశం ఉంటుంది. తదుపరి ఈనెల 16న రాష్ట్ర ఉన్నత విద్యామండలి సీట్ల కేటాయింపు జరపనుంది. ఈనెల 17 నుంచి 22 వరకు కళాశాలల్లో చేరికలు ఉంటాయి. ఈనెల 19న తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 40 ఇంజినీరింగ్ కళాశాలల్లో 22,290 సీట్లు

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల జిల్లాల్లో రెండు ప్రభుత్వ, 38 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో బీటెక్ ప్రథమ సంవత్సరంలో 22,290 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఊపిరికి గండం

- పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు
- ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించాలి
- పొగతాగని వారికీ ఊపిరితిత్తుల క్యాన్సర్
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



గుంటూరు మెడికల్: రోజురోజుకూ ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. సకాలంలో వైద్యం తీసుకోకపోతే ప్రాణాపాయం తప్పదని ఛాతి, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గత నెలలో గుంటూరులో లంగ్ క్యాన్సర్ అప్‌డేట్స్‌పై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పల్మనాలజిస్టులు సమావేశమయ్యారు. ఊపిరి తిత్తుల క్యాన్సర్ బారిన పడకుండా ప్రజల్ని అప్రమత్తం చేయాలని నిర్ణయించుకున్నారు. క్యాన్సర్ మరణాల్లో మూడొంతులు ఊపిరితిత్తులకు సంబంధించినవేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు వెల్లడిస్తున్నాయి.

కారణాలు

ధూమపానం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణం. సిగిరెట్లు, హుక్కా, గంజాయి పీల్చటం లంగ్ క్యాన్సర్‌కు దారితీస్తుంది. ఊపితితిత్తుల క్యాన్సర్ సోకిన వారిలో నూటికి 90 శాతం మంది పొగాకు వినియోగం వల్ల వ్యాధి బారిన పడ్డారు. సాధారణ వ్యక్తితో పోలిస్తే పొగతాగేవారిలో క్యాన్సర్ రావటానికి 2.5 శాతం రెట్లు ఎక్కువ అవకాశం ఉంది. వాతావరణ కాలుష్యం, రేడియేషన్ వల్ల కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నాయి.

పొగతాగేవారి పక్కనుంటే ప్రమాదమే..

పొగతాగేవారి కంటే వారి పక్కన ఉండే వారే ఎక్కువగా లంగ్ క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. మహిళలు, పిల్లలు ఈ బాధితులే. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు, టోల్‌గేట్ వద్ద పనిచేసే సిబ్బందికి, క్వారీలు, మైనింగ్, తారు రోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణాల పనుల్లో పాల్గొనే వారికి ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నట్లు వైద్య నివేదికలు తెలియజేస్తున్నాయి ధూమపానం వల్ల ఊపిరితిత్తులకే కాకుండా శరీరంలోని ఇతర అవయవాలకూ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. పొగతాగటం అలవాటు లేని ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల్లో 65 శాతం మంది మహిళలు, 35 శాతం మంది పురుషులు ఉన్నారు. జిల్లాల్లో 30 మంది పల్మనాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు వారంలో ఇద్దరు లేదా ముగ్గురు బాధితులు ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడి చికిత్స కోసం వస్తున్నారు.


వ్యాధి లక్షణాలు

విడవకుండా దగ్గు రావటం, దగ్గులో రక్తం పడటం, ఆకలి లేకపోవటం, ఛాతిలో నొప్పి, గొంతు బొంగురు పోవటం, ఎలాంటి ప్రయత్నాలు చేయకుండానే బరువు తగ్గిపోవటం, ఎముకలు, కీళ్ళు, వెన్ను, నడుంనొప్పి ఎక్కువ కాలం ఉండటం, శ్వాస సరిగా ఆడకపోవటం, శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడటం, నిద్రలో గురకరావటం, తరచుగా జబ్బు బారిన పడటం లాంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అలస్యం చేయకుండా ఊపిరితిత్తుల క్యాన్సర్‌గా భావించి వైద్యులను సంప్రదించాలి.

ఈ జాగ్రత్తలు పాటించండి

ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే పొగ తాగకూడదు. తాగే వారి పక్కన కూడా ఉండకూడదు. రోజూ కొద్దిపాటి వ్యాయామాలు చేయాలి. వారానికి ఐదు యాపిల్ పండ్లు తింటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. బీటా కెరోటిన్ పోషకాహారం తీసుకోవటం ద్వారా లంగ్ క్యాన్సర్ బారిన పడే ముప్పును తప్పించుకోవచ్చు.


ఆధునిక వైద్యం అందుబాటులో..



క్యాన్సర్లను గుర్తించేందుకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో ఒకరికి లంగ్ క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకోవడం చాలా ఉత్తమం. ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను లోడోస్ సిటీ స్కాన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఒక సెంటీమీటర్ కన్నా తక్కువ సైజులో ఉన్న గడ్డలను నిర్ధారణ చేయవచ్చు. గతంలో క్యాన్సర్ 50 నుంచి 60 ఏళ్ళ మధ్య వయస్సులో ఉన్నవారిలో వచ్చేది. నేడు 30 ఏళ్ళకే క్యాన్సర్లు రావడం బాధాకరం. వ్యాధి నియంత్రణకు ఆధునిక వైద్యం అందుబాటులో ఉంది.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణురాలు గుంటూరు

సకాలంలో గుర్తిస్తే నయం చేయొచ్చు




లక్షణాలు కనిపిస్తే తరచూ పరీక్షలు చేయించుకోవడం ద్వారా సకాలంలో వ్యాధిని గుర్తించవచ్చు. ప్రస్తుతం చాలా మంది ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా మూడో దశలో వ్యాధి ముదిరిన తర్వాత డాక్టర్ వద్దకు వస్తున్నారు. అప్పుడు ఎంత వైద్యం చేసినా ఉపయోగం ఉండదు. వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతున్న దృష్ట్యా 40 ఏళ్ళు పైబడిన ప్రతి ఒక్కరూ ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించే ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్, క్రయో తొరకోస్కోపి వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

కళతప్పిన తీరం



వెలవెలబోతున్న తీరం



రామాపురంలోకి పర్యాటకులు రాకుండా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

పర్యాటకులను అనుమతించని పోలీసులు

చీరాల టౌన్: యువకుల కేరింతలు, చిన్నపిల్లల ఆటలతో సందడిగా ఉండే తీరం నేడు నిర్మానుష్యంగా మారింది. ఆదివారం, సెలవులు వస్తే చీరాలలోని వాడరేవు, రామాపురం సముద్ర తీర ప్రాంతం పర్యాటకుల తాకిడితో కళకళలాడేది. హైద్రాబాద్‌తో పాటుగా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి అధికంగా వచ్చేవారు. అయితే, గత నెల 24 నుంచి తీర ప్రాంతంలోకి పర్యాటకుల్ని పోలీసులు అనుమతించడం లేదు. ఇటీవల పది మందికి పైగా పర్యాటకులు సముద్ర స్నానాలకు వచ్చి మృత్యువాత పడటంతో అధికారులు బీచ్‌లను తాత్కాలికంగా మూసి వేయించారు. తీరానికి వచ్చే దారుల్లో ఆంక్షలు విధించారు. రూరల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ శివ కుమార్, సిబ్బంది గస్తీ కాస్తున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో తీర ప్రాంతంలో 10 బీట్లు, మూడు పికెట్లు ఏర్పాటు చేశారు. తీరం ఒడ్డున హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సముద్రం లోతున్న ప్రాంతంలో ఎర్ర జెండాలను ఎగురవేశారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన ఈపీఎఫ్‌వో పర్సనల్ అసిస్టెంట్, ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఈపీఎఫ్‌వో పరీక్షకు సంబంధించి 2,401 మందికి, ఈఎస్ఐసీ పరీక్షకు 5,433 మంది అభ్యర్థులకు విజయవాడలో 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఈపీఎఫ్‌వో, పర్సనల్ అసిస్టెంట్ పరీక్షలు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్ష జరిగింది. ఈపీఎఫ్‌వో పరీక్షకు 21.91 శాతం మంది, ఈఎస్ఐసీ పరీక్షకు 75 శాతం మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సూపర్‌వైజర్లు, సహాయ సూపర్ వైజర్లు, రూట్ కమ్ లైజనింగ్ అధికారులు తదితరులు సమర్థంగా పనిచేశారు. అదేవిధంగా రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ఆర్‌టీసీ తదితర విభాగాల అధికారులు భాగస్వాములయ్యారు.

పరిశీలించిన కలెక్టర్..

నగరంలో యూపీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సృజన ఆదివారం పరిశీలించారు. నగరంలోని పి.బి సిద్దార్థ కళాశాల ఆవరణలో జరిగిన పరీక్ష తీరును పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.



క్లుప్తంగా

పటిష్ట స్థితిలో 'కర్నూలు'

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 బాలుర క్రికెట్ పోటీల్లో భాగంగా కర్నూలు, శ్రీకాకుళం జిల్లా జరుగుతున్న మ్యాచ్‌లో కర్నూలు జట్టు భారీస్కోర్ దిశగా కొనసాగుతోంది. కర్నూలు జట్టు శనివారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ 9 వికెట్ల నష్టానికి 343 పరుగులను ఆదివారం తన తొలి ఇన్నింగ్స్‌గా డిక్లేర్ చేసింది. దీంతో మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 196 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని భానుప్రకాష్ 39 పరుగులు సాధించాడు. కర్నూలు బౌలర్లు బి.మహిత్ 4, కె.సాయివిఘ్నేష్ 3 వికెట్లు సాధించారు. రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు రెండవరోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ కోల్పోయి 30 పరుగులు సాధించి 177 పరుగుల ఆధిక్యంలో ఉంది. సోమవారం మూడవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి

గురజాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తపై తెలుగుదేశం కార్యకర్త ఆదివారం సాయంత్రం రాయితో దాడి చేసి గాయపరచిన ఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గోగులపాడు గ్రామానికి చెందిన మల్లా వెంకట చలమయ్య పొలం నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన తోటకూర సైదారెడ్డి కనిపించడంతో పలకరించాడు. ఈ నేపథ్యంలో సైదారెడ్డి అధికారం మాది నువ్వు నన్ను తిడతావా అంటూ రాయి తీసుకుని తలపై గట్టిగా కొట్టాడు. దీంతో వెంకట చలమయ్య తలకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరిశీలించి తలకు ఏడుకుట్లు వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రముఖరచయిత నాగసూరికి పురస్కారం

అద్దంకి: స్థానిక శ్రీనివాసా ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ సాహితీ పురస్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖరచయిత నాగసూరి వేణుగోపాల్ పురస్కారాన్ని అందుకున్నారు. సభకు పద్యకవి డి.వి.ఎం. సత్యనారాయణ అధ్యక్షత వహించారు. నంబూరి బాలభార్గవి ప్రార్థన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభికులకు లక్కరాజు శ్రీనివాసరావు ఆహ్వానం పలికారు. పురస్కార గ్రహీత పరిచయాన్ని నంబూరి హనుమంతరావు నిర్వహించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ నాగసూరి వేణుగోపాల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.

'మానవతా'మూర్తికి వందనం

- డాక్టర్ కొత్త శివరామకృష్ణప్రసాద్‌కు జీవనసాఫల్య పురస్కారం
- మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ప్రథమ వార్షికోత్సవం
- కొత్త కార్యవర్గం ప్రమాణస్వీకారం


డాక్టర్ శివరామకృష్ణప్రసాద్‌కు జీవనసాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తెనాలి: శాంతియుత, ఉత్తమ సమాజ నిర్మాణమే మనందరి ధ్యేయం కావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మానవత సంస్థ, తెనాలి శాఖ ప్రథమ వార్షికోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం, జీవన సాఫల్య పురస్కారం ప్రదానోత్సవాన్ని ఆదివారం స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ పంప్స్ సత్సంగ్ హాలులో నిర్వహించారు. మానవత సంస్థ తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంస్థ ఏడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాలు అభినందనీయమని, రానున్న ఏడాదిలో మరింత సేవ చేయాలని సూచించారు. విశిష్ట అతిథి, వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ మాట్లాడుతూ అనేక రంగాల్లో తనదైన ప్రత్యేకతతో మేధో కేంద్రంగా విలసిల్లుతున్న మానవత సంస్థ విద్య, వైద్య రంగాల్లో సేవలు విస్తరించాలని సూచించారు. మానవత, గుంటూరు శాఖ అధ్యక్షుడు పావులూరి రమేష్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుంచి ఒకరు మానవత సభ్యుడు కాగలిగితే సమాజానికి ప్రయోజనం లభిస్తుందన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ సంస్థ తరపున చేపట్టిన కార్యక్రమాల్లో ఉదాత్తమైన 90 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఆత్మీయ పలకరింపు ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని శాఖల్లో ప్రవేశపెట్టేందుకు స్ఫూర్తి కావటంపై సంతోషం వ్యక్తంచేశారు. మానవత తెనాలి కన్వీనర్ తన్నీరు శ్రీనివాసబాబు మాట్లాడుతూ కుంచవరంలోని మానవత ప్రాంగణంలో నిర్మించిన ఉపాధి శిక్షణ, జీవన కళల శిక్షణ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

సంస్థ కొత్త అధ్యక్షుడిగా ఓంకార్ ప్రసాద్

పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యనిపుణుడు, మానవతావాది డాక్టర్ కొత్త శివరామకృష్ణప్రసాద్‌కు మానవత సంస్థ తెనాలి శాఖ తరపున తొలి జీవన సాఫల్య పురస్కారాన్ని డాక్టర్ రావిపాటి వీరనారాయణ చేతుల మీదుగా బహూకరించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కటకం వెంకట ప్రసాద్ (ఓంకార్ ప్రసాద్), కార్యదర్శిగా పి.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎస్‌వీ శర్మ, ఉపాధ్యక్షుడుగా పి.శ్రీనివాసు, సంయుక్త కార్యదర్శిగా డీవీ సోమయ్యశాస్త్రి, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.కళ్యాణి, 14 మంది కార్యవర్గసభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. గౌరవ సలహాదారులు మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, గుడివాడ శాఖ ప్రతినిధి పావులూరి శ్రీనివాసరావు, వజ్రాల రామలింగచారి, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు మాట్లాడారు. తొలుత నృత్యగురువు ఎ.వెంకటలక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ప్రథమ ఆహ్వాన నాటికల పోటీలు

తెనాలి: రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్-తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ప్రథమ ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సాయంత్రం ఆరు గంటలకు ప్రదర్శనలు ప్రారంభం కానున్నట్టు నిర్వాహకులు ఈదర వెంకట పూర్ణచంద్ ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. తొలిరోజు సాయంత్రం ఇంద్రప్రస్థం, స్వప్నం రాల్చిన అమృతం, అందిన ఆకాశం నాటికలు ఉంటాయని, మధ్యలో రోటరీలో ఉత్తమ సేవలు అందించిన అన్నే రత్నప్రభాకర్‌కు రోటరీ వ్యవస్థాపకుడు పాల్ హారిస్ పురస్కారాన్ని అందజేస్తామని తెలిపారు. రెండోరోజైన 9వ తేదీ సాయంత్రం కపిరాజు, నాన్నా నేను వచ్చేస్తా నాటికల ప్రదర్శన, అనంతరం బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు. తొలిరోజున మాజీ మంత్రి ఆలపాటి


ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన నిర్వాహకులు

రాజేంద్రప్రసాద్, రెండోరోజున మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు, నన్నపనేని రాజకుమారి పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఆహ్వాన పత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈదర శ్రీనివాసరావు, పావులూరి రాంబాబు, నల్లూరి వెంకటేశ్వర్లు, డి.మురళీకృష్ణ, అరవపల్లి శ్రీకాంత్, కాకుమాను ఉపేంద్ర, జాన్ కీట్స్, ఆలపాటి కిరణ్ పాల్గొన్నారు.

నేడు డాక్టర్ వైఎస్సార్ జయంత్యుత్సవం

తాడేపల్లిరూరల్: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంత్యుత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పేదల పెన్నిధి, ఆరోగ్యశ్రీ ప్రదాత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

వ్యవసాయ శాఖ పథకాల పేర్లు మార్పు

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాల పేర్లను మార్పు చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ-క్రాప్‌ను ఈ-పంటగా, వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ సమ్మాన్ పథకాన్ని అన్నదాత సుఖీభవగా, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకాన్ని వడ్డీలేని రుణాలుగా, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై)గా, వైఎస్సార్ యంత్ర సేవ పథకాన్ని ఫామ్ మెకనైజేషన్ స్కీమ్‌గా, డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లుగా, వైఎస్సార్ యంత్రసేవ కేంద్రాలను విలేజ్/క్లస్టర్ సీహెచ్‌సీలుగా, వైఎస్సార్ యాప్‌ను వీఏఏ పర్ఫార్మెన్స్ మానిటరింగ్ యాప్‌గా పేర్లు మార్చారు. ఇక నుంచి మార్చిన పేర్లను మాత్రమే వినియోగించాలని వ్యవసాయ శాఖ యంత్రాంగాన్ని ఆదేశించారు.

యూబీఐ రిటైల్ ఎక్స్‌పో


రుణ మంజూరు పత్రాలు అందజేస్తున్న యూబీఐ రీజనల్ హెడ్ జవహర్ అశ్వర్థనాయక్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): నగరంపాలెంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) ప్రాంతీయ కార్యాలయంలో ఆ బ్యాంక్ రిటైల్ ఎక్స్‌పోను ఆదివారం నిర్వహించారు. యూబీఐ రీజనల్ హెడ్ ఎస్.జవహర్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఖాతాదారులకు ఆన్ ది స్పాట్‌లో రుణ మంజూరు పత్రాలను అందజేశారు. జవహర్ మాట్లాడుతూ యూబీఐ ద్వారా సకాలంలో సరళమైన వడ్డీ రేట్లతో గృహ, విద్యా రుణాలను అందిస్తోందని తెలిపారు. ముఖ్యంగా కొల్లేటరల్ లేని స్వదేశీ, విదేశీ విద్యా రుణాలను అందజేయటంలో ఎల్లవేళలా ముందుంటోందని వెల్లడించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన ద్వారా సబ్సిడీతో కూడిన సోలార్ పవర్ ప్యానెల్ లోన్లు కూడా మంజూరు చేయడం జరుగుతోందని, ఈ అవకాశాన్ని అర్హులైన వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ డెప్యూటీ రీజినల్ హెడ్ జె.అశ్వర్థనాయక్, ఎ.రాజేష్, రిటైల్ లోన్ పాయింట్ హెడ్ జీవీ రామాంజనేయ కుమార్, వివిధ బ్రాంచ్‌ల మేనేజర్లు, సిబ్బంది, నగరంలోని ప్రముఖ బిల్డర్లు, ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీలు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ ప్రశ్నార్థకం

- మంత్రి నిమ్మల ప్రకటనే దీనికి నిదర్శనం
- రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు ఆందోళన



తెనాలి: కృష్ణా డెల్టాలో ఈ ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకం కానుందని, అందుకు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు చేసిన ప్రకటనే నిదర్శనమని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. కృష్ణా బ్యారేజి, పులిచింతలలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున ఆగస్టు వరకు కృష్ణాడెల్టాకు సాగునీరు ఇవ్వలేమని మంత్రి పత్రికాముఖంగా తెగేసి చెప్పారని, ఇది నీరు విడుదల చేసే వరకు సేద్యం ఆపాలని పరోక్షంగా రైతాంగానికి సూచించినట్టుగా ఉందని విమర్శించారు. నదుల్లో నీటి నిల్వలు తక్కువ ఉన్నప్పుడు సాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలని, బడా మంచి నీటి వ్యాపార సంస్థలు పెద్ద ఎత్తున నదుల నీటిని వాడుకుంటున్నాయని, దీనిని వెంటనే అరికడితే సాగుకు నీరివ్వడం కష్టం కాబోదని వివరించారు. వ్యాపార సంస్థలకు, చేపల చెరువులకు నీటి వినియోగంపై ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న నీటి కన్నా తక్కువ నిల్వలు ఉన్నప్పుడే ప్రకాశం బ్యారేజీ నుంచి సాగునీరు విడుదల చేశారని గుర్తుచేశారు.

పర్యావరణ పరిరక్షణలో వృక్షాల పాత్ర కీలకం


మొక్క నాటి నీరు పోస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణలో వృక్షాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నాజ్ సెంటర్లోని సెయింట్ జోసఫ్ బీఈడీ కళాశాలలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్, గైడ్ విద్యార్థులు మొక్కలు నాటడం, సంరక్షించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.స్వరూపరాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ, పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి సందర్భాల్లో మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ రోజ్‌లీన్ మాట్లాడుతూ మానవ మనుగడకు మొక్కల పెంపకం, సంరక్షణ అవసరమన్నారు. స్కౌట్స్ అంగ్ గైడ్స్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిషనర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ఈనెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్స్ జిల్లా కార్యదర్శి ఎం.ఏడుకొండలు, జిల్లా సహాయ కార్యదర్శి ఇ.అనిల్, ఏఎస్‌వోసీ నజీర్, డీవోసీ శ్రీహరి, నరేష్, గోపి, స్కౌట్ ఉపాధ్యాయులు ప్రతాపరెడ్డి, సుబ్బారెడ్డి, జి.కిరణ్, మీరావలి, అర్జున్, వరకమలాదేవి, రుద్రమదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ టెస్ట్ క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయండి

మంత్రి కొల్లు రవీంద్రకు విన్నవించిన అసోసియేషన్ నాయకులు



మంత్రి రవీంద్రకు సమస్యను వివరిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఏఎన్‌యూ : రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ 2018లో నిర్వహించిన పరీక్ష అర్హత సాధించిన అభ్యర్థులకు న్యాయం చేయాలని టెస్ట్ క్వాలిఫైడ్ క్యాండిడేట్స్ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలలో 1,100 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి 2018లో పరీక్ష నిర్వహించగా 40 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని వారిలో 3,500 మంది అర్హత సాధించారని వారు మంత్రికి తెలిపారు. అనంతరం ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించగా అప్పట్లో కొందరు హైకోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారని, కేసులు క్లియర్ చేసి ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఇప్పటి వరకు ఎంతో మంది ప్రజాప్రతినిధులు, అధికారులను కోరామని అయినా ఫలితం లేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కేసులు క్లియర్ చేయించి ఉద్యోగాలు భర్తీ చేయాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి కొల్లు రవీంద్ర స్పందిస్తూ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దృష్టికి మీ వినతిని తీసుకెళతానని హామీ ఇచ్చారని అసోసియేషన్ నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ టెస్ట్ క్వాలిఫైడ్ క్యాండిడేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బిరుదు రవిబాబు తదితరులు ఉన్నారు.

చిత్తూరుపై విశాఖ జట్టు ఘన విజయం


85 పరుగులు సాధించిన విశాఖ జట్టు బ్యాట్స్‌మెన్ కె భాను శ్రీ హర్ష


5 వికెట్లుతో విశాఖ బౌలర్ కె.శ్యామ్ దినేష్


5 వికెట్లు తీసిన చిత్తూరు జట్టు బౌలర్ ప్రకాష్ ముత్యాల

మంగళగిరి: అన్ని విభాగాలలో ఆధిక్యం కనబరిచిన విశాఖపట్నం జట్టు చిత్తూరు జట్టుపై ఘన విజయం సాధించింది. నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ అండర్ -16 మెన్ ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలలో ఆదివారం విశాఖపట్నం, చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ రెండో రోజు కొనసాగింది. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేపట్టిన విశాఖపట్నం జట్టు 88.5 ఓవర్లలో 316 పరుగులకు ఆలౌటైంది. కె.భాను శ్రీహర్ష 1 సిక్స్ 16 ఫోర్లతో 85 పరుగులు చేయగా, జి.బి.జస్వంత్ 6 ఫోర్లతో 75 పరుగులు, కె.గౌతమ్ 6 ఫోర్లతో 54 పరుగులతో రాణించారు. చిత్తూరు జట్టు బౌలర్ 23.5 ఓవర్లు బౌలింగ్ చేసి 57 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన చిత్తూరు జట్టు 38.4 ఓవర్లలో 120 పరుగులకే ఆలౌటైంది. జట్టు బ్యాట్స్‌మెన్ షోహాన్ రెడ్డి 3 ఫోర్లతో 26 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్ పి.శ్యామ్ దినేష్ 10 ఓవర్లలో 39 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసి రాణించాడు. చివరకు విశాఖపట్నం జట్టు చిత్తూరు జట్టుపై 104 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

నార్నెపాడు శాసనాన్ని కాపాడుకోవాలి

- 12వ శతాబ్దానికి చెందిందిగా గుర్తింపు
- పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి


శాసనాలను పరిశీలిస్తున్న పురావస్తుశాస్త్ర పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం నార్నెపాడులోని భీమేశ్వరాలయం బయట పడి ఉన్న క్రీస్తు శకం 12వ శతాబ్దానికి చెందిన శాసనాన్ని పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి(సీసీవీఏ), ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మధుచౌక్‌లోని సీసీవీఏ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చారిత్రక సంపదను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించడానికి సీసీవీఏ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లాలోని భీమేశ్వరాలయం పరిసరాలను ఆదివారం పరిశీలించామన్నారు. ఆలయం ఆవరణలో ఉండే 12వ శతాబ్దానికి చెందిన ఎంతో విలువైన ఈ శాసన రాయిని ఆలయ పునర్నిర్మాణ సమయంలో రోడ్డుపై పడేశారని పేర్కొన్నారు.

శాసన రాయిపై క్రీస్తు శకం 1151 నాటివి రెండు, క్రీస్తు శకం 1198 నాటి ఒకటి, క్రీస్తు శకం 12వ శతాబ్దానికి చెందిన రెండు, క్రీస్తు శకం 1266 నాటివి ఒకటి కలిపి మొత్తం ఆరు శాసనాలున్నాయని శివనాగిరెడ్డి వివరించారు. ఈ శాసనాల్లో సోమేశ్వరాలయంలోని కేశవస్వామి అఖండ దీపాలకు దానం చేసిన వారి వివరాలు, ఆలయం ఆవరణలో నంది విగ్రహాలను ప్రతిష్ఠించిన వారి వివరాలు, చెరువును తవ్వించిన వివరాలు ఉన్నాయని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ శాసనాల చారిత్రక విలువపై ఆ గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. సుమారు 800 ఏళ్ల నాటి ఈ శాసనాలను ఆలయ ఆవరణలోనే ప్రత్యేకంగా పీఠం ఏర్పాటు చేసి శాసనంపై ఉన్న వివరాలు అందరికీ తెలిసేలా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. చారిత్రక సంపదను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించడానికి అవసరమైన సహాయాన్ని అందించడానికి తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని చెప్పారు. మణిమేల శివశంకర్, స్వర్ణ చినరామిరెడ్డి తనకు సహకరించారని శివనాగిరెడ్డి తెలిపారు.

వైభవంగా కార్మెల్ మాత జెండా ప్రతిష్ఠ


జెండాను ఊరేగిస్తున్న భక్తులు


కొండపై జెండా ప్రతిష్టిస్తున్న విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి

ఫిరంగిపురం: కార్మెల్ కొండపై వెలసిన కార్మెల్ మాత మహోత్సవాలు ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్టు బాల ఏసు దేవాలయ విచారణ గురువులు ఫాతిమామర్రెడ్డి చెప్పారు. బాల ఏసు ఆలయంలో ఆదివారం ప్రత్యేక దివ్యపూజాబలి నిర్వహించారు. ఆలయ ప్రాంగణం వద్ద జెండాలకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వాక్యోపదేశం చేశారు. అనంతరం ఉత్సవాల గురించి వివరించారు. 11వ తేదీ సాయంత్రం బాల ఏసుదేవాలయంలో దివ్యపూజాబలిని ఫాదర్ ఎస్.చంద్రమోహన్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. 12న సాయంత్రం ఫాదర్ పి.చిన్నయ్యచే దివ్యపూజాబలి, 13న సీహెచ్ జోసఫ్‌కుమార్‌చే దివ్యపూజాబలి నిర్వహిస్తామన్నారు. 14న ఉదయం ఫాదర్, ఫాతిమా మర్రెడ్డి, ఫాదర్ ప్రవీణ్‌కుమార్, ఫాదర్ వి.కిరణ్‌లచే కార్మెల కొండవద్ద దివ్యపూజాబలి నిర్వహిస్తామని చెప్పారు. 15న ఉదయం 8 గంటలకు కార్మెల్ కొండపై ఫాదర్ పి.జోసఫ్‌బాలసాగర్‌చే దివ్యపూజాబలి నిర్వహిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం నిర్వహిస్తామని వివరించారు. సాయంత్రం దివ్యసత్ప్రసాద ప్రదక్షిణ, ఆరాధన బాల ఏసుదేవాలయం నుంచి కార్మెల్ కొండ వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య పాల్గొని దివ్య పూజాబలి, అఖండ జపమాల నిర్వహిస్తారని చెప్పారు. 16న ఫాతిమా మర్రెడ్డి, ఫాదర్ ఎం.బాలస్వామిల ఆధ్వర్యంలో సమష్టి దివ్యపూజాబలి నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం పూజ అనంతరం కార్మెల్‌మాత తేరుప్రదక్షిణ నిర్వహిస్తారని వెల్లడించారు. అనంతరం జెండాలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఊరేగింపుగా కొండమెట్ల వరకు వెళ్లి వాటిని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువులు ప్రవీణ్, ఫాదర్ పి.థోమాసు, ఫాదర్ విలియం, మఠకన్యలు, గుడిపెద్దలు, సోడాలిటీ సభ్యులు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.